రాష్ట్రావతరణ శుభాకాంక్షలు

తెలంగాణ అవతరించి నేటికి దశాబ్దం. ఆదివారం రాష్ట్ర అవతరణ వేడుక సందర్భంగా రాష్ట్రం ఏర్పడటానికి ప్రధాన కారకులైన ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత, తొలి తెలంగాణ ముఖ్యమంత్రికి అవతరణోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు, ప్రజా ప్రతినిధులు, కోలేటి దామోదర్ గుప్తా, ఎమ్మెల్యేలు రాగిడి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలె యాదయ్య, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఇంకా చిత్రంలో కొప్పుల ఈశ్వర్, రసమయి బాల కిషన్, నామా నాగేశ్వర్ రావు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, తదితరులు

హైదరాబాద్ కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ వేడుక

సిటీబ్యూరో, జూన్ 2(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా, రాష్ట్రంలో నెంబర్ వన్ జిల్లాగా నిలిచేలా అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవం వైభవంగా జరిగింది. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్ఓ వెంకటాచారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలతోనే రాష్ట్రం సాకారం

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

ఆర్కేపురం, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని స్మారక స్థూపం వద్ద రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అమరవీరులకు నివాళులర్పించారు. అమరుల ప్రాణ త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, వారి త్యాగాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పంకజ, సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, రంగారెడ్డి జిల్లా డీసీడీఓ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుదాం

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూన్2(నమస్తే తెలంగాణ): దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో కలెక్టర్ గౌతమ్ పాల్గొని ప్రసంగించారు. ఎంతో మంది త్యాగధనుల కృషి ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ నిఖితపంత్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణోత్సవం సందర్భంగా ఆదివారం జాతీయ పతాక కాంతుల్లో మెరిసిపోతున్న శ్వేత సౌధం (సచివాలయం), అమరుల చిహ్నం; పైన చమ్కాయిస్తున్న బింబాలకు అద్దం పడుతున్న హుస్సేన్ సాగరం జలాలు.. అందమైన దృశ్యానికి నిదర్శనం

రాష్ట్రావతరణ వేడుకల్లో భాగంగా ఆదివారం గన్ పార్కు వద్ద అమర వీరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ నేత నారాయణ, తదితరులు

ఐటీ కారిడార్ – టీ హబ్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో స్టార్టప్ నిర్వాహకులతో కలిసి పాల్గొన్న సీఈఓ ఎం.ఎస్.రావు తదితరులు

ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, అధికారులు

బాలాపూర్ చౌరస్తాలో ప్రొఫెసర్ జయ శంకర్ సార్‌కు, అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నేతలు, తదితరులు

ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో..

ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్ రావు తదితరులున్నారు.

– సిటీబ్యూరో, జూన్ 2(నమస్తే తెలంగాణ)

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా హైదరాబాద్ జిల్లా డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకటి, మిగతా సిబ్బంది ఆవిష్కరించారు.

– సిటీబ్యూరో, జూన్ 2(నమస్తే తెలంగాణ);

బేగంపేటలోని మెట్రో రైలు భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకల్లో జెండాను ఆవిష్కరిస్తున్న మెట్రో ఎం.డి ఎన్వీఎస్ రెడ్డి

జల మండలిలో..

సిటీబ్యూరో, జూన్ 2(నమస్తే తెలంగాణ): ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించిందని జల మండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఖైరతాబాద్ జల మండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ సుదర్శన్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు, విద్యార్థుల పాత్ర మరువలేనిదని సుదర్శన్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్ కుమార్, రవి కుమార్, స్వామి, రఘు, సీజీఎం, జీఎంలు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఏసీబీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్

కాలుష్య కట్టడికి సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, జూన్ 2(నమస్తే తెలంగాణ): ప్రపంచ వరల్డ్ బైస్కిల్ డేను పురస్కరించుకుని స్టార్ ఆసుపత్రి, హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఆధ్వర్యంలో నానక్‌రాంగూడ స్టార్ ఆసుపత్రి నుంచి సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ వరకు ఆదివారం సైక్లింగ్ రైడ్ జరిగింది. పెద్ద ఎత్తున సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైక్లింగ్ వినియోగాన్ని పెంచి కాలుష్యాన్ని కట్టడి చేయాలని, డ్రగ్స్ బారిన పడొద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని సామాజిక సందేశాలతో సైక్లిస్టులు అవగాహన కల్పించారు. సైక్లింగ్ వినియోగానికి ప్రోత్సాహం అందించడానికి ఈ రైడ్ నిర్వహించినట్టు హెచ్‌సీజీ ఫౌండర్ రవీందర్ తెలిపారు.

మాగంటికి బీఆర్ఎస్ అధినేత శుభాకాంక్షలు

హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జన్మదినం సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

– బంజారాహిల్స్, జూన్ 2

మండు వేసవిలో వయోధికుల సేవలు అభినందనీయం

శిబిరంలో అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట్, జూన్ 2: వేసవి ఎండల్లో రోడ్లపై బాటసారులకు ఎండ వేడిమి నుంచి కాస్తంత సాంత్వన చేకూర్చేలా ఎస్సార్‌నగర్‌లోని శ్రీ శ్రీనివాస సమాజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 రోజులకు పైగా కొనసాగిన ఉచిత మధ్యాహ్న మిత భోజన శిబిరం ఆదివారం ముగిసింది. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలతో పాటు శిబిరం ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చివరి రోజున వచ్చినవారికి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నం వడ్డించారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి సమాజం పట్ల తన వంతు బాధ్యతగా, సేవా దృక్పథం కలిగి ఉన్న పలువురు వయోధికులతో కలిసి గత దశాబ్ద కాలానికి పైగా ఎస్సార్‌నగర్ వార్డు కార్యాలయం సమీపంలో ప్రతి వేసవిలో దాదాపు రెండు నెలల పాటు మధ్యాహ్న సమయంలో దాదాపు 350 మందికి పైగా ప్రతి రోజు చక్కటి భోజనంతో పాటు పండ్లు, మజ్జిగ పంపిణీ చేస్తుండటం అభినందనీయమని, ట్రస్ట్ సేవలను గుర్తిస్తున్న దాతలు ఆ రోజుల్లో తమ వంతు భోజన ఖర్చులకు ఆర్థికంగా చేయూతనందిస్తుండటం విశేషమన్నారు. ప్రతి యేటా ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని ట్రస్ట్ ప్రతినిధుల బృందంతో కలిసి విజయవంతం చేస్తున్న డి.పార్థసారథిని ఎమ్మెల్యే తలసాని ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషు కుమారి, ఎస్సార్‌నగర్ వయోధికుల మండలి అధ్యక్షులు మాణిక్ రావు పాటిల్, బీఆర్ఎస్ సనత్‌నగర్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐసీఏఐ హైదరాబాద్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ లావణ్య

అమీర్‌పేట్, జూన్ 2: ఐసీఏఐ హైదరాబాద్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా సీఎంఏ డాక్టర్ లావణ్య కందూరి ఎన్నికయ్యారు. సంస్థకు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న డాక్టర్ లావణ్య కందూరి 2024-25 వార్షిక సంవత్సరానికి గాను చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. కార్పొరేట్ సెక్టార్, అకాడమిక్స్ విభాగంలో ఆమె విశేష సేవలందించారు. లావణ్య ప్రస్తుతం మేన్సన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చైర్‌పర్సన్, డీన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీఏఐ హైదరాబాద్ చాప్టర్‌కు ఆఫీస్ బేరర్లుగా ఎన్నికైన వారిలో వైస్ చైర్మన్‌గా సీఎంఏ డాక్టర్ డి.వెంకట రాంబాబు, కార్యదర్శిగా ఖాజా జలాలుద్దీన్, కోశాధికారిగా సీఎస్ కీర్తి అగర్వాల్, సభ్యులుగా హిమ విద్య సంగవరపు, మసనూరి బాలకృష్ణ, ఎల్.ఎన్.శృతి కనుగుల్పుల, ఎన్.గణేష్, ఈవీ ఉషారాణిలున్నారు.

ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి పరిశీలన

హోలీమేరీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకురాలు ప్రియాంక శుక్లా, కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూన్ 2(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం హోలీమేరీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ప్రియాంక శుక్లా, జిల్లా కలెక్టర్ గౌతమ్‌లు ఆదివారం పరిశీలించారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, బారికేడింగ్‌లు, ఇంటర్నెట్ మౌలిక వసతుల కల్పన పూర్తి అయినట్లు అధికారులు సాధారణ పరిశీలకురాలు ప్రియాంక శుక్లాకు వివరించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపునకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.